
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.6 ، కనిష్ఠం 21.6
నిజామాబాద్
జిల్లా వార్తలు

గురువారం 29 ఫిబ్రవరి 2024






# పసుపునకు డిమాండ్

- జిల్లాలో పసుపునకు పెరిగిన ధర
- వన్నెల్ గ్రామానికి చెందిన రైతు పసుపునకు క్వింటా రూ.14,255
- ప్రతిరోజూ నగరంలోని మార్కెట్‌కు భారీగా కొత్త పసుపు




నిజామాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పసుపునకు ధర భారీగా పెరుగుతోంది. పంట సాగు విస్తీర్ణం తగ్గడం డిమాండ్ ఉండటంతో ధర వస్తుంది. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం తీసుకువచ్చిన పసుపునకు భారీగా ధర వచ్చింది. గడిచిన కొన్నేళ్లుగా ఎప్పుడు రాని విధంగా క్వింటాలుకు 14వేల 255 రూపాయల ధర పలికింది. మార్కెట్‌కు వస్తున్న పసుపునకు సరాసరి ధర క్వింటాలు 8వేల నుంచి 12వేల మధ్యన అమ్మకాలు జరుగుతున్నాయి. నాణ్యమైన పసుపునకు అధిక ధర రావడంతో పాటు వ్యాపారులు కూడా డిమాండ్ ఉండటంతో ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో ఇప్పటి వరకు కొత్త పసుపు ఈ రెండు నెలల్లో లక్షా 39వేల క్వింటాళ్లను కొనుగోలు చేశారు. ఈ ఏడాది విస్తీర్ణం తగ్గడం వల్ల జూన్ లోపు 6లక్షల క్వింటాలలోపు మాత్రమే పసుపు వస్తుందని అంచనా వేస్తున్నారు. వ్యాపారులు మార్కెట్‌తో పాటు నేరుగా రైతుల దగ్గరకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు.

## తగ్గిన సాగు విస్తీర్ణం

పసుపునకు భారీగా డిమాండ్ వస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా పసుపు సాగు విస్తీర్ణం తగ్గింది. డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి లేకపోవడంతో కొత్త పసుపుకు ధర పెరుగుతోంది. రాష్ట్రంలో నిజామాబాద్ జిల్లాలో ఎక్కువగా పసుపు సాగవుతోంది. ఈ జిల్లాతో పాటు జగిత్యాల, నిర్మల్, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల పరిధిలో కొంత మేర పసుపు సాగవుతుంది. ఇతర జిల్లాలో పసుపు అంతగా సాగు చేయడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలో కలిపి 36వేల ఎకరాల్లో మాత్రమే ఈ యేడాది పసుపు సాగైంది. జిల్లాలో 19వేల 500 ఎకరాల్లో పసుపు పంటను వేశారు. నైజాం కాలంలో మొదలైన ఈ పసుపు సాగు ఇప్పటి వరకు కొనసాగుతోంది. జిల్లాలో పదేళ్ల క్రితం 50వేల ఎకరాల్లో సాగు కాగా ప్రస్తుతం ధరలు లేక 19వేల 500 ఎకరాలకు పడిపోయింది. సాగు విస్తీర్ణం తగ్గడానికి ప్రధాన కారణం పెట్టుబడి పెరగడం గత ఐదేళ్లుగా ధర రాకపోవడం వల్ల గిట్టుబాటు కాక రైతులు సాగును తగ్గించారు. గత సంవత్సరం మార్కెట్‌కు పసుపు తీసుకువస్తే నాణ్యమైన పసుపుకూడా క్వింటాలుకు 7వేల వరకు ధర రాలేదు. ఎక్కువ మంది రైతులు క్వింటాలు 4వేల నుంచి 5వేల 500 మధ్యనే అమ్మకాలను చేశారు.

## జనవరి నుంచి కొత్త పసుపు

జిల్లాతో పాటు ఇతర జిల్లాలో ధరలు రాక సాగు తగ్గించగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెరిగిన డిమాండ్ వల్ల పసుపునకు ధర వస్తుంది. ఈ సంవత్సరం జనవరి నెల నుంచి కొత్త పసుపు మార్కెట్‌కు వస్తుంది. డిసెంబర్ నెల నుంచి క్వింటాలుకు 10వేల ధర ఉండగా జనవరి నెల నుంచి ధర పెరుగుతోంది. ప్రతిరోజూ 4వేల నుంచి 8వేల క్వింటాల మధ్య పసుపు వస్తుంది. కొత్త పసుపు రావడంతో మొదట క్వింటాలు 11వేల వరకు ఉండగా ఫిబ్రవరి ఆరంభం నుంచి ధర 13వేల వరకు పెరిగింది. ఫిబ్రవరి నెల మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు అత్యధికంగా కొంత మంది రైతులకు 13వేల నుంచి 14వేల మధ్య అమ్మకాలు జరిగాయి. సరాసరి ధర క్వింటాలు 8వేల నుంచి 12వేల 500ల మధ్య అమ్మకాలు జరిగాయి. నిజామాబాద్ మార్కెట్‌కు బుధవారం తీసుకువచ్చిన పసుపుకు కొంత మంది రైతులకు క్వింటాలు 14వేల 255 రూపాయల ధర పలికింది. వన్నెల్ గ్రామానికి చెందిన పన్నాల మహిత 16 క్వింటాల పసుపు తీసుకురాగా ఈ ధర వచ్చింది. ఈ సంవత్సరం అత్యధిక ధర ఈ రైతుకే వచ్చింది. ఇతర రైతులకు కూడా కొంత మందికి క్వింటాలుకు 14వేల రూపాయలకు పైగా ధర వచ్చింది. కాడి రకానికి ఈ ధర రాగా, గోల రకానికి 12వేల 29 రూపాయల ధర పలికింది. విస్తీర్ణం తగ్గడం జాతీయ స్థాయిలో డిమాండ్ పెరగడం వల్ల వ్యాపారులు కూడా ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. రాబోయే రోజుల్లో కూడా ఇంకా ధర పెరుగుతుందని అంచనాకు వస్తున్నారు. జిల్లాతో పాటు జగిత్యాల, నిర్మల్ జిల్లాలో ఉన్న విస్తీర్ణం ప్రకారం ఈ ఏడాది మార్కెట్‌కు 6లక్షల క్వింటాళ్లలోపే పసుపు వస్తుందని అంచనాకు వస్తున్నారు. ఇప్పటి వరకు మార్కెట్‌కు లక్షా 39వేల క్వింటాలు కొత్త పసుపు అమ్మకాలు జరిగాయి. వచ్చే జూన్ వరకు ఈ పసుపు 6లక్షల క్వింటాళ్ల వరకు అమ్మకాలు జరిగే అవకాశం ఉందని మార్కెట్ అధికారులు అంచనాకు వస్తున్నారు. ప్రతి సంవత్సరం 8 నుంచి 10లక్షల క్వింటాళ్ల వరకు పసుపు అమ్మకాలు జరిగేవి. విస్తీర్ణం తగ్గిపోవడం వల్ల ఈ దఫా అమ్మకాలు కూడా తగ్గుతున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మార్కెట్‌కు కొత్త పసుపు రావడం వల్ల కొనుగోలు ఎక్కువగా జరుగుతుంది. డిమాండ్ ఉండటంతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది పసుపు వేసిన రైతులకు మాత్రం సిరులను పండిస్తుంది. గత సంవత్సరం అమ్మిన ధరకంటే డబుల్ రేట్‌కు ఈ ఏడాది రైతులు పసుపు అమ్మకాలను చేస్తున్నారు. మార్కెట్‌లో ఈ ఏడాది ధర బాగా వస్తుందని కార్యదర్శి వెంకటేశం తెలిపారు. డిమాండ్ ఉండటం వల్ల ధర పెరిగిందన్నారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు అమ్మకానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు.



పాత కలెక్టరేట్‌లో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

# నేడు నగరంలో 'విజయసంకల్ప యాత్ర'

- హాజరుకానున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ
- ఏర్పాట్లను పరిశీలించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

పెద్దబజార్, ఫిబ్రవరి 28: బీజేపీ చేపట్టిన విజయసంకల్ప యాత్ర నేడు జిల్లా కేంద్రంలో ముగియనుంది. ఈ యాత్రకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హాజరు కానున్నారు. మధ్యాహ్నం 2గంటలకు పాత కలెక్టరేట్ ఆవరణలో ఈ ముగింపు సభ జరగనుంది. కేంద్ర మంత్రితో పాటు మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ పైడి రాకేష్‌రెడ్డితో పాటు ఇతర నేతలు హాజరుకానున్నారు. పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో జరిగే సభ ఏర్పాట్లను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఏర్పాట్లపై సమీక్షించారు. సభకు నగరంతో పాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు హాజరవుతారని ఆయన తెలిపారు.

## నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

ఖిల్లా: నగరంలో నితిన్ గడ్కరీ కార్యక్రమం సందర్భంగా గురువారం ట్రాఫిక్ మళ్లిస్తున్నామని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ తెలిపారు. బోధన్ నుంచి వచ్చే వాహనాలను అర్సపల్లి రైల్వే గేట్ మీదుగా కొత్త కలెక్టరేట్ వరకు మళ్లిస్తామని తెలిపారు. మీటింగ్ జరిగే సమయంలో బస్టాండ్ నుంచి బయలుదేరే వాహనాలు రైల్వేస్టేషన్ మీదుగా ఎన్టీఆర్ టీ జంక్షన్, నిఖిల్‌సాయి హోటల్‌వైపు మళ్లిస్తామని తెలిపారు. మీటింగ్ అనంతరం ట్రాఫిక్ పునరుద్ధరిస్తామని ఆయన తెలిపారు.

# బోధన్, ఆర్మూర్ ఆర్డీవోల బదిలీ

నిజామాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు ఆర్డీవోలను ప్రభుత్వం బదిలీ చేసింది. బోధన్, ఆర్మూర్‌లో పనిచేస్తున్న ఈ ఇద్దరు ఆర్డీవోలను బదిలీ చేస్తూ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ఉత్తర్వులను జారీ చేశారు. ఆర్మూర్‌లో ఆర్డీవోగా పనిచేస్తున్న వినోద్‌కుమార్‌ను భూపాలపల్లి ఎల్‌ఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బదిలీ చేశారు. ఆయన స్థానంలో బోధన్‌లో పనిచేస్తున్న బూర్గు రాజాగౌడ్‌ను నియమించారు. బోధన్‌కు మంచిర్యాలలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసిన సిదాందత్తును ఆర్డీవోగా నియమించారు. వీరిని వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు.



- పార్లమెంట్ పరిధిలో పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశం
- జాబితాను సిద్ధం చేస్తున్న జిల్లా అధికారులు

# మరోసారి బదిలీలు

నిజామాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికలు అధికారులను ఉరుకులు పెట్టిస్తోంది. ఎన్నికలకు ముందే కీలక పోస్టులో మూడేళ్లు పనిచేసిన అధికారులను బదిలీ చేశారు. ఇతర జిల్లాలకు కేటాయింపులను చేశారు. పార్లమెంట్ నియోజకవర్గాలు రెండు మూడు జిల్లాలకు విస్తరించి ఉండటంతో ఆ జిల్లాలకు బదిలీ చేసిన వారిని ఇతర జిల్లాలకు చేయాలని మళ్లీ ఆదేశాలు ఇవ్వడంతో జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో బదిలీ చేసేందుకు సిద్ధం అవుతున్నారు. ఎన్నికల బదిలీలపై జిల్లాకు వచ్చిన అధికారులు తమకున్న పరపతి, పలుకుబడి ప్రజాప్రతినిధుల జోక్యంతో కీలక స్థానాల్లో పోస్టింగ్‌లు పొందారు. విధులను నిర్వర్తిస్తున్నారు. మళ్లీ ఎన్నికల కమిషన్ ఆదేశాలతో జాబితాను సిద్ధం చేస్తుండటంతో జిల్లాలో పోలీసు, రెవెన్యూతో పాటు ఇతర శాఖల అధికారులు పెద్ద ఎత్తున బదిలీ కానున్నారు.

## ఇదివరకే భారీగా బదిలీలు

పార్లమెంట్ ఎన్నికలకు ముందే జిల్లాలో పనిచేస్తున్న పోలీసు, రెవెన్యూ, ఎన్నికలతో సంబంధమున్న ఇతర అధికారులను బదిలీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇవ్వడంతో భారీ ఎత్తున అధికారులు బదిలీ అయ్యారు. అదనపు కలెక్టర్ నుంచి డిప్యూటీ తహసీల్దార్ వరకు రెవెన్యూ శాఖలో బదిలీలను చేశారు. ఎస్సై నుంచి అదనపు ఎస్పీ వరకు పోలీసుశాఖలో బదిలీ అయ్యా రు. వీరితో పాటు ఎన్నికలతో సంబంధం ఉన్న ఎక్సైజ్, ట్రాన్స్‌పోర్ట్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలతో పాటు ఇతర శాఖల అధికారులు బదిలీ అయ్యారు. ఎంపీడీవోలు, జడ్పీ సీఈవోలు, డిప్యూటీ సీఈవోలు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులు, డివిజన్ పంచాయతీ అధికారులు బదిలీ అయ్యారు. రవాణా శాఖలో ఎన్‌వీఐలు, ఆర్‌టీవోలు, డిప్యూటీ కమిషనర్ ట్రాన్స్‌పోర్ట్ అధికారులు బది లీ అయ్యారు. ఎక్సైజ్ శాఖలో ఎస్సై, సీఐలతో పాటు అసిస్టెంట్, సూపరింటెండెంట్, అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్లు బదిలీ అయ్యారు. ఇతర జిల్లాల నుంచి ఎస్సైలు, సీఐలు, తహసీల్దార్లు, ఏసీపీలు, అదనపు డీసీపీలు, ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లు జిల్లాకు వచ్చారు. జిల్లాకు వచ్చిన ఎస్సైలు, సీఐలు, డిప్యూటీ తహసీల్దార్లు, తహసీల్దార్లకు పోస్టింగ్‌లను ఇచ్చారు. వీరితో పాటు ఎంపీడీవోలు, ఎంవీఐల కు కూడా బదిలీల్లో భాగంగా జిల్లాలో పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈనెల మొదటి వారం నుంచి రెండో వారం వరకు ఈ బదిలీలన్నీ కొనసాగాయి.

## పలుకుబడి ఆధారంగా ప్రయత్నాలు

జిల్లాకు వచ్చిన అధికారులు ప్రధానమైన మండలాలకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేశారు. కొంత మంది తమకున్న పలుకుబడి ఆధారంగా ప్రయత్నాలు చేసి ప్రజాప్రతినిధుల అండదండలతో కీలకపోస్టులను పొందారు. మరికొంత మంది తమకు వచ్చిన పోస్టింగ్‌లో చేరారు. కొంత మంది పార్లమెంట్ పరిధిలోని జగిత్యాల జిల్లా నుంచి ఈ జిల్లాకు రాగా మరికొంత మందిని ఉమ్మడి జిల్లా పరిధిలోని కామారెడ్డి పరిధి నుంచి జిల్లాకు వచ్చారు. మిగతా వారు మల్టీజోన్ పరిధిలోని ఇతర జిల్లాల నుంచి వచ్చారు. ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాతో పాటు పార్లమెంట్ పరిధిలో బదిలీ అయిన వారందరినీ ఇతర జిల్లాలకు బదిలీ చేయాలని ఈ మధ్యనే కేంద్ర ఎన్నికల కమిషన్ మళ్లీ ఆదేశాలు ఇచ్చింది. వెంటనే జాబితాను సిద్ధం చేసి బదిలీలు చేయాలని కోరింది. శాసనసభ ఎన్నికలలాగానే అధికారులను బదిలీ చేసిన ఉన్నతాధికారులు కేంద్ర ఎన్నికల కమిషన్ మళ్లీ ఆదేశాలు ఇవ్వడంతో ఈ పార్లమెంట్ పరిధిలో బదిలీలు చేసిన అధికారులను తిరిగి ఇతర జిల్లాలకు చేసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జాబితాను సిద్ధం చేస్తున్నారు. శాసనసభ ఎన్నికల సమయంలో నిజామాబాద్, జగిత్యాల జిల్లాలో పనిచేసిన అధికారుల జాబితాను సరిచూస్తూ కొత్త జాబితాను సిద్ధం చేశారు. ఎన్నికల కమిషన్‌కు పంపించారు. కమిషన్ ఆదేశాల మేరకు ఒకటి రెండు రోజుల్లో అధికారులు బదిలీ కానున్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో జిల్లా నేతలతో సంబంధమున్న అధికారులను ఇతర జిల్లాలకు బదిలీ చేస్తే వారి ప్రభావం ఉండదని ఎన్నికల కమిషన్ భావించడం వల్లనే మళ్లీ ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిసింది. జిల్లాకు వచ్చిన అధికారుల్లో 50 శాతానికి పైగా మళ్లీ బదిలీ కానున్నారు.



- పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఐఈవో రఘురాజ్

# ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు ఒకరి డిబార్
- ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను అనుమతించని అధికారులు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 28: జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇంటర్ మొదటి సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1 పరీక్ష ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 57 పరీక్షా కేంద్రాలలో మొత్తం 19వేల 117 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 18వేల 322 మంది విద్యార్థులు హాజరుకాగా 795 మంది గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ విద్యార్థులు 16వేల 717 మందికి గాను 16వేల 108 మంది పరీక్షకు హాజరుకాగా, 609 మంది గైర్హాజరయ్యారు. 2400 మంది ఒకేషనల్ విద్యార్థులకు గాను 2214 మంది హాజరుకాగా 186 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఒక మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు చేశారు. నవీపేట మోడల్ కళాశాలలో విద్యార్థిపై మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదైంది. డీఐఈవో రఘురాజ్ 9 పరీక్షా కేంద్రాలను, పరీక్ష నిర్వహణ కమిటీ సభ్యులు 5, హైపవర్ కమిటీ 6, సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 28 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. డీఐఈవో రఘురాజ్ నగరంలోని కాకతీయ మహిళా కళాశాల ఏబీ సెంటర్లను, వెక్టర్ కళాశాలను తనిఖీ చేశారు. నగరంలోని కంఠేశ్వర్‌లోగల ఎస్ఆర్ కళాశాలలో పరీక్ష సమయానికి ఆలస్యంగా వచ్చిన ముగ్గురు విద్యార్థులను పరీక్షకు అనుమతించలేదు. గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి.



- విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది
- హాల్‌టికెట్ నెంబరు చూసుకుంటున్న విద్యార్థులు
- నగరంలోని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

# 1 నుంచి 'గృహజ్యోతి' అమలు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 28: మార్చి 1 నుంచి తెల్లరేషన్ కార్డు ఉండి అర్హులైన వారందరికీ గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తామని టీఎస్ ఎన్‌పీడీసీఎల్ నిజామాబాద్ ఎస్ఈ రవీందర్ తెలిపారు. గృహజ్యోతి పథకం పొందడానికి అర్హులైన వారు ప్రజాపాలన దరఖాస్తు చేసుకోకుండా ఉండి ఉంటే ఏవైనా వివరాలు సరైనవి లేక లబ్ధిపొందకపోయినచో ఎంపీడీవో మున్సిపల్ కార్యాలయాల్లో విద్యుత్ కనెక్షన్ నెంబరు, తెల్ల రేషన్ కార్డుతో అనుసంధానం చేసుకోవాలన్నారు. గృహజ్యోతి పథకం అర్హత కలిగిన విద్యుత్ వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అర్హత కలిగిన వారందరికీ జీరో బిల్ అందజేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తు పెండింగ్‌లో ఉంటే దరఖాస్తు పరిశీలన అయ్యేంతవరకు విద్యుత్ సిబ్బంది కరెంట్ బిల్లును వసూళ్లపై ఏమి చర్యలు తీసుకోరన్నారు. ఈ విషయంపై విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

# నేడు సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని పరిశీలించనున్న బీజేపీ నేతలు

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 28: రూరల్ పరిధిలోని సారంగాపూర్‌లోని ఎన్‌సీఎఫ్‌ఎస్ ఫ్యాక్టరీని బీజేపీ నేతలు నేడు పరిశీలించనున్నారు. గురువారం ఉదయం 11 గంటలకు బీజేపీ నేతలు ఫ్యాక్టరీకి రానున్నారు. చక్కెర ఫ్యాక్టరీలోని మిషనరీ, యంత్ర పరికరాలు, ఫ్యాక్టరీ పరిసరాలు, ఫ్యాక్టరీకి సంబంధించిన భూములు పరిశీలించనున్నారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణను తీసుకోవాల్సిన చర్యల గురించి, ఫ్యాక్టరీలో పనిచేసిన కార్మికులు, ఉద్యోగులు, సిబ్బంది, చెరుకు రైతులతో మాట్లాడనున్నట్లు బీజేపీ రూరల్ కన్వీనర్ పద్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ధర్మపురి అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త, బీజేపీ సీనియర్ నేత ఈటల రాజేందర్, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొననున్నారు.

## ఎంఎడ్ 3వ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 28: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని ఎంఎడ్ రెగ్యులర్ 3వ సెమిస్టర్ పరీక్షలు రెండో రోజు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం జరిగిన పరీక్షకు 36మంది విద్యార్థులకు గాను 35మంది పరీక్షకు హాజరయ్యారని, ఒకరు గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## జిల్లాకు వ్యవసాయ డిగ్రీ కళాశాల మంజూరు



మాట్లాడుతున్న పరిశోధక విద్యార్థి సంఘ నాయకులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 28: నిజామాబాద్ జిల్లాకు వ్యవసాయ డిగ్రీ కళాశాల మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ బుధవారం తెలంగాణ యూనివర్సిటీలో, టీయూ పరిశోధక విద్యార్థి సంఘం, మరియు ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పరిశోధక విద్యార్థి సంఘంఅధ్యక్షుడు పుప్పల రవి మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా విద్యార్థులకు వ్యవసాయ డిగ్రీ కళాశాల దశాబ్దాల కల అని మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, లకు సహకరించిన మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే భూపతిరెడ్డి లకు ధన్యవాదలు తెలిపారు. జిల్లాలో ఈ యూనివర్సిటీ ఏర్పాటుతో ఎంతో మంది విద్యార్థులకు ఉన్నత చదువు దక్కుతుందని తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో వర్సిటీ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు కొమిరే శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి రాజేందర్, తెలంగాణ ఉద్యమకారులు లక్ష్మణ్, వినయ్, ఉన్నారు.

# బండి సంజయ్ కాన్వాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తున్నాం

● నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా



పెద్దబజార్, ఫిబ్రవరి 28:బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కాన్వాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. బుధవారం అర్బన్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో మాజీ ప్రధాని పీవీనర్సింహారావు ఇంటిని సందర్శించి ముల్కనూరుకు బయలుదేరుతుండగా పొన్నం ప్రభాకర్ అనుచరులు కోడిగుడ్లతో కాన్వాయ్ పైన దాడి చేయడం సరైందికాదన్నారు. బండి సంజయ్ ప్రజాహిత యాత్రలో భాగంగా ముల్కనూరుకు వెళ్తుండగా పొన్నం ప్రభాకర్ అనుచరులు కాన్వాయ్‌పై దాడి చేయడం, నీచమైన పనులు చేయించడం సరైందికాదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మోదీ చరిష్మా తట్టుకోలేక బీజేపీ ఎదుగుదలను ఓర్వలేక పిరికిపంద చర్యలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తప్పకుండా బుద్ధి చెబుతారని అన్నారు. పొన్నం ప్రభాకర్‌కు దమ్ముంటే బండి సంజయ్‌పైన ఎంపీగా పోటీ చేసి గెలవాలని అన్నారు. పోలీసుల సమక్షంలో ఈ దాడి జరగడం పోలీసుల గులంగిరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.










# భీమ్‌గల్ మున్సిపాలిటీలో మొదలైన రచ్చ

● రాధం చెరువు సర్వే పూర్తి, కందకం పనులు షురూ ● సర్వేప్రకారం కందకం పనులు కొనసాగిస్తున్న రెవెన్యూ అధికారులు ● రాధం చెరువు శిఖం భూమిలో అక్రమ గృహనిర్మాణాలు, వెంచర్లు


రాధం చెరువుచుట్టూ అక్రమంగా వెలిసిన గృహనిర్మాణాలు


చెరువు శిఖం భూమిలో హద్దులను గుర్తిస్తూ కందకం తవ్వుతున్న రెవెన్యూ శాఖ అధికారులు


రాధం చెరువులో అక్రమంగా వెలిసిన వెంచర్‌లో నూతన గృహనిర్మాణాలు

భీమ్‌గల్ రూరల్, ఫిబ్రవరి 28: భీమ్‌గల్ మున్సిపాలిటీలో గత కొన్ని రోజులుగా రెవెన్యూ అధికారులు రెవెన్యూ జిల్లా స్థాయి అధికారుల జాయింట్ సర్వేలో భాగంగా ఆక్రమణకు గురైన రాధం చెరువు, మొగిలిచెరువు, ధర్మారాయుడు కుంట, బడిచెరి కుంటల సర్వే పనులు కొనసాగుతున్నాయి.. సర్వేలో భాగంగా రాధంచెరువు సర్వే నెంబరు 27లో 73 ఎక రాల సర్వే పూర్తి అయ్యింది. గత వారం రోజుల నుంచి రాధం చెరువు శిఖం భూమిలో హద్దుల ప్రకారం కందకాలను తవ్వడం మొదలుపెట్లారు రెవెన్యూ అధికారులు..కందకం తవ్వకాల్లో అధికారులకు ఎన్నో రకాల అడ్డంకులు ఎదురవుతున్నాయి. కందకం పనులు పూర్తి స్థాయిలో కొనసాగిస్తారా, రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి తప్పుల తడక కందకాల పనులు ముగించేస్తారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది..

● కందకానికి అడ్డంగా గృహనిర్మాణాలు

రాధం చెరువు భూమి సర్వే ప్రకారం హద్దులను కేటాయిస్తూ కందకాలను జేసీబీ సహాయంతో తవ్వుతున్నారు. మొదటగా సుభాష్ నగర్ వద్ద ఉన్న చెరువు ముఖద్వారం నుంచి కందకం పనులను ప్రారంభించారు అధికారులు. కందకం పనులు కొనసాగుతున్న క్రమంలో కందకానికి అడ్డంగా చెరువు భూమిలో అక్రమంగా వెలిసిన గృహనిర్మాణాలు దర్శనమిస్తున్నాయి. కందకానికి ఎక్కడైతే అడ్డుగా వస్తున్న గృహాలను విడిచిపెడుతూ ముందుకు కందకాలను తవ్వుతున్నారు. మరికొన్నిచోట్ల కందకాలకు చెరువునీరు వుండడంతో ఆలస్యమవుతోంది. రాధం చెరువును ఆనుకొని ఇటీవల కొత్తగా వెంచర్ వెలిసింది. వెంచర్‌కు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని వెంచర్ యజమానులు వెంచర్ చుట్టూ ప్రహరీ గోడను నిర్మించి వెంచర్ లోని ప్లాట్‌లను పూర్తిగా అమ్మివేశారు. ఇట్టి వెంచర్‌లో కొంతమంది ప్లాటు యజమానులు గృహనిర్మాణాలు చేపడుతున్నారు. నూతన గృహనిర్మాణాల పనులు కొనసాగుతున్నాయి. రెవెన్యూ అధికారులు నిర్వహించిన సర్వేలో ఏకంగా వెంచర్‌లోని సగంభూమి చెరువు శిఖం భూమిగా గుర్తించి కందకాన్ని తవ్వారు. లక్షల రూపాయలు గుమ్మరించి తమ కష్టార్జితంతో ఒక్క ప్లాటు కొనుగోలు చేస్తే అదికాస్త చెరువు భూమిలో ఉందని అధికారులు ట్రెంచ్ కొట్టారని వాపోతున్నారు. వెంచర్ యజమానులు వెంచర్‌కు సంబంధించి నాలా, డీటీసీపీ లే అవుట్‌తో కూడిన అన్ని రకాల అనుమతులు ఉన్నాయని ప్లాట్‌లను అమ్మారని బాధితులు వాపోతున్నారు. మరికొందరు ఏకంగా గృహనిర్మాణాలు చేపడుతున్నారు. మరికొందరు అక్రమంగా చెరువు భూమిని కబ్జాచేసి దర్జాగా మున్సిపాలిటీ అనుమతులు పొంది గృహనిర్మాణాలు చేపట్టారు. చెరువు శిఖం భూమిలో పుట్టగొడుగుల్లా అక్రమ సర్వే నెంబర్‌లతో సబ్ రిజిష్టార్ కార్యాలయంలో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు జరిగాయి. వీరికి అనుమతులు ఎవరు ఇచ్చారు. అనే సందేహాలు ప్రస్తుతం భీమ్‌గల్ మున్సిపాలిటీలో హాట్‌టాపిక్‌గా మారింది. అక్రమంగా వెలిసిని గృహనిర్మాణాలు వుంటాయా?, నిబంధనల ప్రకారం అక్రమంగా వెలిసిన ప్లాట్‌లను, గృహనిర్మాణాలను తొలగిస్తారా? అన్న సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

### రాధం చెరువు కందకం పనులు కొనసాగుతున్నాయి



భీమ్‌గల్ పట్టణంలోని ప్రధాన చెరువుల సర్వే కొనసాగుతోంది. అందులో రాధం చెరువు సర్వే పూర్తి అయ్యింది. కందకం పనులు కొనసాగుతున్నాయి. పనులు పూర్తికాగానే పై అధికారులకు నివేదికలు అంది స్తాం. రాధం చెరువు కబ్జాకు గురైందా? లేదా అన్నది భీమ్‌గల్ మున్సిపాలిటీ అధికారుల జాయింట్ సర్వేతో తెలుస్తోంది.

- శ్రీలత, తహసీల్దార్, భీమ్‌గల్

# సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

రుద్రూరు, ఫిబ్రవరి 28 : రుద్రూరు మండల కేంద్రంలోని బస్టాండ్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఆరు గ్యారెంటీలలో మరో రెండు గ్యారెంటీలైన 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను ప్రారంభించిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు టపాసులను పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూరి చంద్రశేఖర్, రుద్రూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోట అరుణ్‌కుమార్, నాయకులు నడిపింటి నగేష్, పట్ల సురేష్, అనిల్ పటేల్, గౌస్, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**మోస్రా:** మోస్రా మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొత్తిమీర్‌కర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఏదైనా వాగ్ధానం చేస్తే కచ్చితంగా అమలు చేస్తోందని అందులో భాగంగా రూ.200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తోందని తెలిపారు ఈ కార్యక్రమంలో మోస్రా గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు సైనిపురం నర్సారెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బొజ్జ శ్రీనివాస్, సీనియర్ నాయకులు హరి నారాయణ, మండల ఉపాధ్యక్షుడు ఎంటికల శంకర్, తిమ్మాపూర్ పార్టీ అధ్యక్షుడు గజ్జి నారాయణ, గోవూరు పార్టీ అధ్యక్షుడు గంగారాం, ఓబీసీ జిల్లా సెక్రటరీ అశోక్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సాయిలు, జలీల్, వినాయక్, వీరన్న, శ్రీధర్, చింతకుంట పోతారెడ్డి, దోమల శ్రీనివాస్, అఫ్రోజ్, చింటు తదితరులు పాల్గొన్నారు.

**వర్ని:** 500రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అమల్లోకి తేవడంతో బుధవారం మండల కేంద్రంలో మహిళలు పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. జై కాంగ్రెస్ నినాదాలతో హోరెత్తించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ, రాజ్యం కల సాకారం అయిందని జడ్పీటీసీ అంబర్ సింగ్, వైస్ ఎంపీపీ దశగౌడ్, నాయకులు రాంరెడ్డి, పోత రాజు శ్రీనులు హర్షం వ్యక్తం చేశారు.


సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


పొతంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

● ఎంపీపీ ఆధ్వర్యంలో సంబరాలు

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల అమలును హర్షిస్తూ బుధవారం వర్ని మండల కేంద్రంలో ఎంపీపీ మేక శ్రీలక్ష్మి వీర్రాజు ఆధ్వర్యంలో సంబరాలు చేశారు. సీఎం, ఉప ముఖ్యమంత్రి, సోనియా, రాహుల్ గాంధీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్ దశరథ్, మండల పార్టీ అధ్యక్షుడు సురేష్ బాబా, డీసీసీ డెలిగేట్ రాజిరెడ్డి, లక్ష్మణ్, గంగప్ప. రాంరెడ్డి, భీమ, శంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కోటగిరి:** కోటగిరి, పొతంగల్ మండల కేంద్రాల్లో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల్లో గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్తు పథకాలను అమలు చేయడం పట్ల హర్షిస్తూ సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఎన్ని ఇబ్బందులు వచ్చిన అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోటగిరి మండల నాయకులు మనోహర్, షహీద్, శ్రీనివాస్ రావు, గంగాధర్ దేశాయ్, శివరాజ్ దేశాయ్, పొతంగల్‌లో హెగ్డోలి శంకర్, వీరేశం, రామిరెడ్డి, ధన్‌రాజ్, రాజు, దత్తు తదితరులు పాల్గొన్నారు.

## బైక్ అదుపు తప్పి అన్నదమ్ముల మృతి

పిట్లం,ఫిబ్రవరి28: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని పిట్లం - మద్దెల్ చెరువు ప్రధాన రహదారిపై బుధవారం తెల్లవారు జామున బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొన్న సంఘటనలో సవాయి సింగ్ (45), కిషన్(36) అన్నదమ్ములు మృతి చెందారు. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం మండలంలోని సిద్దాపూర్ తండాకు చెందిన సవాయి సింగ్, కిషన్, కిషన్ కుమారుడు కార్తిక్ ముగ్గురు పిట్లం మండలంలోని రూం తండాలో సుభాష్ చెల్లెలి పెళ్లి జరిగింది. వివాహ కార్యక్రమానికి హాజరై బుధవారం తెల్లవారు జామున రెండు గంటల ప్రాంతంలో సుభాష్, ముగ్గురుని ఒకే ద్విచక్ర వాహనంపై తీసుకెళుతున్నాడు. కాగా పిట్లం - మద్దెల్ చెరువు ప్రాంతంలో బైక్ అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొని నలుగురు కింద పడ్డారు. సవాయి సింగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డుపై వెళుతున్న స్థానికులు గమనించి కిషన్‌ను బాన్సువాడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సుభాష్‌కు గాయాలు కావడంతో నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కార్తిక్‌కు చిన్న పాటి గాయాలు అయ్యాయి. సవాయి సింగ్ తమ్ముడు దేవీ సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. అతి వేగం, ఒకే బైక్‌పై నలుగురు వెళ్లడంతోనే ప్రమాదం జరిగిందని ఆయన తెలిపారు.

## ఏడాది కుమారున్ని రోడ్డుపై వదిలి..

● ప్రధాన కాల్వ వద్ద అదృశ్యమైన కన్న తల్లి

● నీటిలో దూకిందనే అనుమానంతో గాలింపు చర్యలు


అందోల్ శిరీష(ఫైల్)

నిజాంసాగర్(మహ్మద్‌నగర్), ఫిబ్రవరి 28: ఎల్లారెడ్డి మండలం లోని గండిమాసాని పేట్ గ్రామానికి చెందిన అందోల్ శిరీష అలి యాస్ పద్మ (25) అనే వివాహిత మహ్మద్‌నగర్ మండలంలోని గాలిపూర్ గేటు సమీపంలో గల 10వ నెంబర్ డిస్ట్రిబ్యూటరీ సమీ పంలోని ప్రధాన కాల్వ వద్ద తన ఏడాది కుమారుడిని రోడ్డుపై వదిలి అదృశ్యమైనట్లు శిరీష సోదరుడు శివ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. బాన్సువాడ మండలంలోని తాడ్కోల్ గ్రామానికి చెందిన లక్ష్మీ కుమార్తెను 3 సంవత్సరాల క్రితం ఎల్లారెడ్డి మండలం గండి మాసాని పేట్‌కు చెందిన అందోల్ సతీష్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి సంవత్సరం బాబు యోగేష్ ఉన్నాడు. ఈ నెల 17వ తేదిన బాబు పుట్టిన రోజు వేడుకలు సైతం ఘనంగా నిర్వహించారు. బుధవారం గండి మాసానిపేట్ నుంచి శిరీష కాళ్లకు మెట్టెలు చేయించుకునేందుకు తల్లిగారి పిలుపుతో తాడ్కోల్‌కు బయలుదేరి వెళ్లారు. అయితే బుధవారం ఉదయం భర్త ఎల్లారెడ్డిలో బస్సు ఎక్కించి ఇంటికి వెళ్లిపో యాడు. తన ఏడాది కుమారుడిని రోడ్డుపై వదిలి అదృశ్యమైంది. రోడ్డు పై సంవత్సరం బాబు ఏడుస్తూ కనిపించడంతో అటుగా వెళు తున్న ప్రయాణికులు ఓద్విచక్ర వాహన దారుడు, స్థానికులు బాబును గుర్తించి అక్కున చేర్చుకున్నారు. ఒడ్డున చెప్పులు, బాగు ఉంది. బ్యాగును తనిఖీ చేయగా, శిరీష ఆధార్ కార్డు కనిపించడంతో స్థానికులు 100కు ఫోన్ చేశారు. దీంతో నిజాంసాగర్ పోలీసులు సంఘ టన స్థలానికి చేరుకుని బాబును నిజాంసాగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వచ్చా రు. అనంతరం శిరీష కుటుంబీకులు నిజాంసాగర్‌కు చేరుకోవడంతో వారి కుటుంబీకులకు బాబును అప్పగించారు. శిరీష తల్లి రోదిస్తూ తన బిడ్డ ప్రధాన కాల్వలో పడి మృతిచెందిందని, అల్లుడి వేధింపుల వల్లే తన బిడ్డ తనకు కాకుండా పోయిందంటూ రోదించసాగడంతో స్థానికులు సైతం కంట తడి పెట్టారు. నిజాం సాగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నీటి పారుదల శాఖ అధికా రులకు సమాచారం అందించారు. దీంతో నిజాంసాగర్ ప్రధాన కాల్వ ద్వారా కొనసాగుతున్న నీటి విడుదలను నిలిపివేశారు. నీటి ఉధృతి తగ్గిన తర్వాత గాలింపు చర్యలు ముమ్మరంచేయనున్నారు.

## పట్టణాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం

● పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి



బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్

బోధన్ రూరల్, ఫిబ్రవరి 28: పట్టణాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని, బోధన్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రజలు పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని బోధన్ మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి అన్నారు. బుధవారం బోధన్ మున్సిపల్ సమావేశ మందిరంలో 2024-25 బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలకతీతంగా అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామన్నారు. పట్టణ అభివృద్ధికి 23 కోట్ల 50 లక్షలతో ప్రణాళిక రూపొందించామన్నారు. త్వరలో పట్టణ అభివృద్ధికి నిధులు రానున్నాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సహకారంతో తెలంగాణలో బోధన్ మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

## మారంపల్లి సబ్‌సెంటర్ తనిఖీ

డొంకేశ్వర్, ఫిబ్రవరి28: డొంకేశ్వర్ మండలంలోని మారంపల్లి గ్రామంలో సబ్‌సెంటర్‌ను డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్ తనిఖీ చేశారు. టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. 3వ తేదీ నిర్వహించే పల్స్ పోలియో సిబ్బందికి పలు సూచనలు చేశారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని పిల్లలకు తప్పకుండా పోలియో వేసే విధంగా చూడాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. గ్రామంలో నూతన సబ్‌సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సురేందర్, ఎంఎల్‌హెచ్‌సీ సతీష్, ఎఎన్‌ఎం షైముద్‌బేగం, ఆశకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా టైలర్స్ డే

పెర్కిట్, ఫిబ్రవరి28: ప్రపంచ టైలర్స్ డే పురస్కరించుకొని బుధవారం ఆర్మూర్ పట్టణంలో మేరు సంఘం ఆధ్వర్యంలో బుధవారం టైలర్స్ డే ఘనంగా నిర్వహించారు. పట్టణంలో మేరు సంఘం నుంచి పాతబస్టాండ్, జెండగల్లి, పెర్కిట్, మామిడిపల్లి, నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు మేరుకులస్థులు కుట్టుమిషన్‌లతో బైక్ ర్యాలీ నిర్వహిస్తూ ఆర్డీవో కార్యాలయంలో మేరు కులస్థుల సమస్యలపై మెమో రాండం అందజేశారు. అనంతరం మేరు సంఘంలో పలువురు సీనియర్ మేరు కులవృత్తిదారులకు పట్టుశాలువ పూలమాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రవినాథ్, సెక్రెటరీ లక్ష్మణ్, కోశాధికారి గంగాధర్, కొట్టూరు వినోద్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న మేర సంఘ సభ్యులు

## జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు


విజ్ఞాన్‌లో ప్రదర్శనను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

నిజామాబాద్‌అర్బన్,ఫిబ్రవరి28: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని పలు పాఠశాలలో బుధవారం సైన్స్ ప్రదర్శనలను నిర్వహించారు. నగరంలోని ఎస్ఆర్ డీజీ, ఎస్ఆర్ ప్రైమ్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో నిర్వహించిన సైన్స్ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. 5వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులు వివిధ ప్రదర్శనలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఈ ప్రదర్శనలను ఎస్ఆర్ పాఠశాలల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్ సంతోష్‌కుమార్, జోనల్ ఇన్‌చార్జి ప్రణీత్‌కుమార్, ప్రిన్సిపల్ తిలకించి విద్యార్థులను అభినందించారు.

● విజ్ఞాన్‌లో ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శన

నగరంలోని ఓల్డ్ ఎన్‌జీవోస్ కాలనీలోగల విజ్ఞాన్ హైస్కూల్‌లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబీషన్ ఆకట్టుకుంది. పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబీషన్‌ను ట్రస్మా ప్రతినిధి నర్సింహారావు, మోహన్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన త్రీడీ ప్రదర్శనను తిలకించారు. విద్యార్థులు వివిధ విభిన్నమైన ప్రాజెక్టులను రూపొందించగా వాటి వివరాలు తెలుసుకొని వారిని అభినందించారు.

**డొంకేశ్వర్:** విద్యార్థి దశ నుంచి సైన్స్ కార్యక్రమాలు విద్యార్థులకు నేర్పించాలని రాబోయే రోజుల్లో సైంటిస్టులుగా ఎదగుతారని ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం డొంకేశ్వర్ మండలంలోని ప్రభుత్వ పాఠ శాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్‌కుమార్,వెంకటరమణచారి పాల్గొన్నారు.

**ఏర్గట్ల:** మండలంలోని తొర్తి గ్రామంలోని ఉన్నత పాఠశాలకు పీపుల్స్ వారియర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. బుధవారం విద్యార్థులకు సైన్స్ ఉపకరణాలను పంపిణీ చేశారు.

**పెర్కిట్:** ఆర్మూర్ పట్టణంలోని జెంటిల్‌కిడ్స్ పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో రాజగంగారాం పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రామకృష్ణ, టీచర్లు పాల్గొన్నారు.

**నందిపేట:** మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో బుధవారం నేషనల్ సైన్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు అనేక వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

**మోర్తాడ్:** మండలంలోని పాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. నోడల్ అధికారి తమ్మిరెడ్డి విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలను పరిశీలించి అభినందించారు.ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్‌రావు,లక్ష్మీనర్సయ్య, నర్సింహస్వామి, సుమలత, లచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

**కమ్మర్‌పల్లి:** జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలం లోని పలుప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం విద్యార్థులు సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

**ధర్పల్లి:** సైన్స్ నిత్య జీవితంలో ఒక భాగమని సైన్స్‌తోనే సర్వమానవాళి మనుగడ కొనసాగుతుందని లిటిల్ హార్ట్స్ పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్ అన్నారు. బుధవారం పాఠశాలలో సైన్స్‌ఫేర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సాధన, విద్యార్థులు, టీచర్లు పాల్గొన్నారు.

**నవీపేట:** మండలంలోని నాళేశ్వర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సరిన్, పాఠశాల హెచ్‌ఎం, టీచర్లు తదితరులున్నారు.

**మోస్రా:**మండలంలోని చింతకుంట గ్రామంలో నలంద విద్యానిలయంలో జాతీయసైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శన చూసి ఉపాధ్యాయుల బృందం ప్రశంసించారు.



నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

## చీడపీడలపై అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా వ్యవసాయ అధికారి సాదిక్ హుస్సేన్

ధర్పల్లి, ఫిబ్రవరి 28: చీడపీడల సమస్యలపై వ్యవసాయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి సాదిక్ హుస్సేన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గల పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయిలో సిబ్బంది పరిశీలించి రైతులకు తగిన సూచనలు ఇవ్వాలన్నారు. పంటల నమోదు ప్రక్రియ ఖచ్చితంగా చేయాలని అన్నారు. ఆన్‌లైన్‌లో పొందుపరిచేటప్పుడు జాగ్రత్త వహించాలని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో పంట పొలాలను పరిశీలించిన తర్వాతే పంటల నమోదు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. యూరియా సమస్యలు కానీ చీడపీడల సమస్యలు ఉండకుండా ఎప్పటికప్పుడు రైతులతో సమన్వయంగా ఉండాలన్నారు. పురుగుమందులను వాడేటప్పుడు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మోతాదుకు మించి వాడరాదని వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనల మేరకు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రవీణ్, విస్తరణ అధికారి మనోజ్, రైతులు తదితరులు ఉన్నారు.

## వైభవంగా కుంకుమార్చనలు

ఖిల్లా, ఫిబ్రవరి 28: నగరంలోని కోటగల్లిలోని మార్కండేయ మందిరంలో బుధవారం వైభవంగా కుంకుమార్చన నిర్వహించారు. ఈ శ్రీచక్ర కుంకుమార్చనలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శ్రీ భక్త మార్కండేయ ప్రాణప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా ఈ కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురోహితులు చౌట్‌పల్లి గంగాప్రసాద్ దీక్షిత్‌లు, జిల్లా పద్మశాలి సంఘం వర్కింగ్‌ప్రెసిడెంట్ హన్మాండ్లు, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గుజ్జరాజేశ్వరి, నగర పద్మశాలి సంఘం అధ్యక్షుడు వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

### శ్రీ మహాగణపతి ఆలయంలో సంకష్ట చతుర్దశి

ఖిల్లా: నగరంలోని ఖిల్లా రఘునాథ చెరువు వద్ద ఉన్న శ్రీ మహాగణపతి దేవాలయంలో బుధవారం సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామివారికి పంచామృత అభిషేకం, సిందూర సమర్పణ, గరిక పూజ, గణపతి హోమాన్ని నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ చిలుముల భూషణ్‌చారి, అర్చకులు రాజుశర్మ, విష్ణుశర్మ, నవీన్ ఆచార్య, కమిటీ సభ్యులు శ్రీనివాస్, భూపాల్, శ్రావణ్, భక్తులు పాల్గొన్నారు.

## మొదటి రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం



పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థుల సందడి

బోధన్ రూరల్, ఫిబ్రవరి 28: బోధన్ డివిజన్‌లో 13 పరీక్షా కేంద్రాల్లో బుధవారం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఇంటర్ మొదటి సంవత్సరంలో 4256 మందివిద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 4123 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాలను బోధన ఏసీపీ శ్రీనివాస్, తహసీల్దార్ గంగాధర్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు సందర్శించారు.

**కోటగిరి:** మండలంలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నిర్ణీత సమయానికి విద్యార్థులకు పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. మొదటి సంవత్సరం పరీక్షకు 252మంది విద్యార్థులకు 248మంది విద్యార్థులు హాజరయ్యారు.

**డిచ్‌పల్లి:** మండలంలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్ష కేంద్రాల్లో బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఇంటర్ ప్రథమ పరీక్షలకు 28మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 257 మంది విద్యార్థులకు గాను 254 మంది పరీక్షకు హాజరయ్యారని, ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ చంద్రవిఠల్ తెలిపారు. మోడల్ కళాశాల పరీక్ష కేంద్రంలో 262 మంది విద్యార్థులకు గాను 251 విద్యార్థులు హాజరయ్యారని 11మంది గైర్హాజరయ్యారని సూపరింటెండెంట్ గణేశ్ తెలిపారు. ఒకేషనల్‌కు సంబంధించిన 132 మంది విద్యార్థులకు గాను 131 మంది పరీక్షకు హాజరయ్యారని ఒకరు మాత్రమే గైర్హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు. ధర్మారం(బి) సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 355 మంది గాను 345 మంది పరీక్షకు హాజరయ్యారని, 10మంది గైర్హాజరయ్యరని చీఫ్ సూపరిండెంట్ సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌పీఆర్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 301 మంది విద్యార్థులకు గాను 298 మంది హాజరకాగ ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని సూపరిండెంట్ ముత్తెన్న పేర్కొన్నారు. పరీక్షకేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ నారాయణ, డిచ్‌పల్లి తహసీల్దార్ ప్రభాకర్‌లు సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు.

**నవీపేట:** మండల కేంద్రంలోని మోడల్ కళాశాల పరీక్ష కేంద్రంలో మొదటి రోజు మోడల్ కళాశాల, రెంజల్ మోడల్ కళాశాల, మైనారిటీ బాలికల గురుకుల కళాశాల, కస్తూర్బా బాలికల కళాశాల, నవోదయ కళాశాలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాశారు. 448మంది విద్యార్థులను గాను 430మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని అధికారులు పేర్కొన్నారు. విద్యార్థి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతుండగా డిబార్ అయ్యారని అధికారులు పేర్కొన్నారు.



# రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే సరికి ఖజానా ఖాళీ

● బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల




బోధన్‌లో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

బోధన్‌రూరల్/కోటగిరి, ఫిబ్రవరి 28: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే సరికి ఖజానా ఖాళీ అయి ఉత్త చిప్ప మిగిలిందని, తమ హామీల కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం డిల్లీ పెద్దల చుట్టూ చక్కర్లు కొడుతున్నారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ ఎద్దేవా చేశారు. బీజేపీ తలపెట్టిన కొమురభీం క్లస్టర్ విజయ సంకల్ప యాత్ర బోధన్ నియోజకవర్గంలో కొనసాగింది. బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం నిర్వహించిన బహిరంగ సభలో ఈటల రాజేందర్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు గత కేసీఆర్ ప్రభుత్వ పనితీరుపై తీవ్ర స్థాయిలో మం డిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తప్పుడు హామీలతో అధికారాన్ని గద్దల తన్నుకుపోయిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయడం అసాధ్యమని పేర్కొన్నారు. తాను గతంలో ఆర్థిక మంత్రిగా పని చేసిన అనుభవంతో హామీలను అమలు చేయడం అసాధ్యమని పేర్కొన్నారు. 2లక్షల రుణమాఫీ చేసే దమ్ము కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. గృహజ్యోతి, మహాలక్ష్మి, పింఛన్‌ల పెంపు వంటి పథకాలు అమలు చేయాలంటే ఖజానాలో డబ్బులు లేవన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రుణమాఫీ కోసం ఔటర్ రింగ్‌రోడ్, హైదరాబాద్ భూములను అమ్ముకుంటే వడ్డీలు మాత్రమే చెల్లించారని గుర్తుచేశారు. ప్రధాని మోదీ 75ఏళ్ల స్వాతంత్ర భారత దేశంలో మహిళల ఆత్మ గౌరవాన్ని కాపాడేందుకు 12కోట్ల మందికి టాయిలెట్లు కట్టించారని గుర్తు చేశారు. 4కోట్ల మందికి సొంత ఇళ్లు కట్టించారన్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ కేంద్రం సమకూర్చిన నిధులతో చేపట్టారని గుర్తు చేశారు.

### వచ్చే ఎన్నికలు స్వర్గానికి, నరకానికి మధ్య : ఎంపీ అర్వింద్

వచ్చే పార్లమెంట్ ఎన్నికలు స్వర్గానికి, నరకానికి మధ్య జరగనున్నాయని ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని ఎంపీ ధర్మపురి అరవింద్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలకు పితామహులని ఆరోపించారు. దేశం సురక్షితంగా ఉండాలంటే మోదీకి ఓటు వేయాలని లేని పక్షంలో నరకానికి పోయే ప్రమాదం ఉందన్నారు. బోధన్ త్వరలోనే అతి పెద్ద సౌత్ రైల్వే జంక్షన్ అవుతుందన్నారు. బోధన్-బీదర్ రైల్వే లైన్‌తో పాటు ముంబాయి, ఢిల్లీ, బెంగళూరు వంటి నగరాలకు కొత్త కొత్త రైళ్లు ప్రారంభించే ప్రయత్నం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫ్యాక్టరీ విషయంలో కృతనిశ్చయంగా ఉందనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, గంగారెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

## రాబోయే కాలంలో కాంగ్రెస్ కనుమరుగు

● ఎంపీ ధర్మపురి అర్వింద్

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 28: 60ఏళ్ల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలతో రాజకీయం తప్ప అభివృద్ధి చేయలేదని, రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగవుతుందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీ కార్యాలయంలో మాట్లాడుతూ.. నియోజక వర్గానికి రావాల్సిన నిధులు రాకుంటే కొడంగల్‌లో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి చేసే నిరాహార దీక్షకు పూర్తి మద్దతు తెలుపుతామన్నారు. జిల్లాలో పసుపు విస్తీర్ణత తగ్గలేదని, సాగుఖర్చు ఎక్కువై రైతులు నష్టపోతున్నారని, ప్రస్తుతం పసుపు ధర పెరిగిందన్నారు. అనంతరం పసుపు రైతులతో ఆయన సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులచారి, విజయ సంకల్పయాత్ర కార్యదర్శి రమానథ్, జీవీ.నర్సింహరెడ్డి పాల్గొన్నారు.

### ఎంపీ ఎన్నికలు రాముడు, రావణాసుడు మధ్యనే

నందిపేట: దేశంలో జరగబోయే పార్లమెంటు ఎన్నికలు రాముడు, రావణాసుడు మధ్యనేనని ఎంపీ అర్వింద్ అన్నారు. బుధవారం మండలంలోని వెల్మల్, నందిపేట జరిగిన విజయసంకల్ప యాత్రలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. కాగా, మండలంలోని జన్నేపల్లి, నవీపేటలలో బుధవారం బీజేపీ నాయకులు రోడ్ షో నిర్వహించారు. నందిపేట నుంచి బోధన్‌కు వెళ్తూ మార్గమధ్యంలో వారు జన్నేపల్లి, నవీపేటలో కొద్దిసేపు ఆగి ప్రత్యేక వాహనంలో బోధన్‌కు తరలివెళ్లారు.

### నిరాశపర్చిన ఈటల పర్యటన

రెంజల్: మండలంలో బుధవారం నిర్వహించిన బీజేపీ విజయ సంకల్ప యాత్ర కార్యకర్తలను నిరాశపర్చింది. మండలంలోని సాటాపూర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ మాట్లాడకపోవడంతో బీజేపీ కార్యకర్తలు నిరుత్సాహానికి గురయ్యారు.

# బీఐఎస్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

● అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 28: నిత్య జీవితంలో మనం వినియోగించే వస్తువుల నాణ్యత, ప్రామాణికతను నిర్ధారించే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండెర్డ్స్ గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం బీఐఎస్ పనితీరుపై అవగాహన సదస్సు నిర్వహించారు. వస్తువుల నాణ్యత ఎలా గుర్తించడం, నకిలీ వస్తువులను గుర్తించిన సందర్భంలో ఎవరికి ఫిర్యాదు చేయాలి అనే అంశంపై అన్ని శాఖల అధికారులకు అవగాహన కల్పించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన బీఎస్ఐ సంస్థ సైంటిస్ట్ సరిత బీఐఎస్ పనితీరును వివరిస్తూ అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. బీఐఎస్ కేర్ యాప్‌ను వినియోగదారులు డౌన్‌లోడ్ చేసుకోవాలని దీని ద్వారా ఐఎస్ఐ మార్క్ కలిగిన ఉత్పత్తుల ప్రామాణికతను పరిశీలన చేసుకోవడంతో పాటు లైసెన్సు గడువు, లైసెన్సుదారుని వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఈ సదస్సులో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### మూగజీవాల సంక్షేమానికి కృషి చేయాలి..

మూగజీవాలపై ప్రతి ఒక్కరూ ప్రేమ పూర్వకంగా వ్యవహరిస్తూ వాటి సంరక్షణకు సంక్షేమానికి తమవంతు బాధ్యతగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ కిణ్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన నేతృత్వంలో కలెక్టరేట్‌లో జిల్లా జంతు సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతు సంరక్షణ కోసం కమిటీ చిత్తశుద్ధితో పనిచేయాలని జంతు ప్రేమికులు వాటి సంరక్షణ కోసం జిల్లా కమిటీకి విరాళాలు అందించాలన్నారు. విరాళాలు అందించాల్సిన వారు పశుసంవర్ధక శాఖ కార్యాలయ అధికారులకు సంప్రదించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో కుక్కల బెడద వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పట్టణాల్లో, గ్రామ పంచాయతీలో కుక్కల సంతతిని నిరోధించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జంతు సంక్షేమ పక్షోత్సవాల సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు ఆయన ప్రశంసాపత్రాలు, మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైద్య అధికారి జగన్నాథచారి, డాక్టర్ బాలిక్ హైమద్, బసవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం: రూరల్ ఎమ్మెల్యే



సొసైటీ ఛైర్మన్ ప్రమాణ స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

డిచ్‌పల్లి,ఫిబ్రవరి 28: రైతుల సంక్షేమం ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతందని, గత బీఆర్ఎస్ పాలనలో రైతులకు సరైన న్యాయం జరగలేదని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన డిచ్‌పల్లి సొసైటీ నూతన ఛైర్మన్‌గా రాంచందర్ గౌడ్ ప్రమాణ స్వీకర కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టుల పేరుతో కోట్లాది రూపాయలు ఎమ్మెల్యేలు, కేసీఆర్ కుటుంబం దోచుకుందని, రైతుల పంటలకు కనీసం సాగు నీరు అందించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో రూరల్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తిచేసి రైతన్నల పంట పొలాలకు సాగు నీరు అందిస్తామని తెలిపారు. డిచ్‌పల్లి సొసైటీ ఛైర్మన్‌గా యానంపల్లి గ్రామ డైరెక్టర్ రాంచందర్ గౌడ్ ఎన్నికకావడంతో ఆయనకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రమాణ స్వీకర కార్యక్రమానికి మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోలసాని శ్రీనివాస్, సొసైటీ ఉపాధ్యక్షుడు కుమ్మరి చిన్నగంగారం, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లోకి ఘన్‌పూర్ బీఆర్ఎస్ నాయకులు

డిచ్‌పల్లి: మండలంలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు శక్కరికొండ సాగర్ ఆధ్వర్యంలో 20మంది బీఆర్ఎస్ కార్యకర్తలు ఎమ్మెల్యే భూపతిరెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో సాగర్, దేవిదాస్ శక్కరికొండ, గంగప్రసాద్, రమేశ్, జనార్దన్, రాజేందర్, సుధీర్‌రెడ్డి, నడ్పిసాయిలు, భూమయ్య, జనార్దన్ ఏ, సాయినాథ్, మోహన్, శ్రీను, గోపి, మోహన్ లు ఉన్నారు.

### అగ్నిప్రమాద బాధితులకు రూరల్ ఎమ్మెల్యే పరామర్శ

ఇందల్వాయి: మండలంలోని లోలం గ్రామంలో మంగళవారం అగ్నిప్రమాదంలో రెండు గుడిసెలు దగ్ధమైన విషయం తెలిసిందే. బుధవారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి లోలం గ్రామానికి వెళ్లి అగ్నిప్రమాద బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని అన్నారు. అగ్ని ప్రమాదంలో సత్తెమ్మ, భూమయ్యలకు చెందిన నివాసపు గుడిసెలు పూర్తిగా దగ్ధమయ్యాయని దీంతో వారు సర్వస్వం కోల్పోయారని అన్నారు. బాధితులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. ఆయన వెంట డీసీసీబీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గుట్ట గంగాధర్, లక్ష్మణ్, రాజన్న, మోహన్, ఆసీఫ్, లక్ష్మి, తదితరులు ఉన్నారు.

### జూన్‌లోగా రైతాంగానికి సాగునీరు

జక్రాన్‌పల్లి: గుత్ప లిఫ్ట్ పైప్‌లైన్ పనులు పూర్తి చేసి రానున్న మే, జూన్ నెలల్లోగా రైతులకు సాగునీరు అందిస్తామని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. మాక్లూర్ మండలం గుత్ప గ్రామంలో జక్రాన్‌పల్లి, ఆర్మూర్ మాక్లూర్ మండలాల రైతాంగానికి సాగునీరు అందించే గుత్ప లిఫ్ట్ పైప్‌లైన్ అర్ధంతరంగా నిలిచిపోయిన లిఫ్ట్ పనులను బుధవారం ఈ మూడు మండలాల రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ లిఫ్ట్ పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, జాప్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎనిమిదేళ్ల క్రితం ఎన్నికల స్టంట్‌లో భాగంగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ గుత్ప లిఫ్ట్ పైప్‌లైన్ పనులను హడావిడిగా ప్రారంభించి మధ్యలో అర్ధాంతరంగా పనులు నిలిపివేసిందన్నారు. కార్యక్రమంలో ఆర్మూర్ నియోజకర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వినయ్‌కుమార్‌రెడ్డి, మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ ఎం.సాయిరెడ్డి, మాజీఎంపీపీ కె.అనంత్‌రెడ్డి, మాజీసర్పంచ్ ఎం.చిన్నసాయిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## స్నేహ సొసైటీలో జాతీయ సైన్స్ దినోత్సవం

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 28: నగరంలోని మారుతినగర్‌లో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ ఛైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా దివ్యాంగులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి రసూల్‌బీ, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, జిల్లా సైన్స్ అధికారి గంగా కిషన్, తదితరులు పాల్గొన్నారు.

## పీజీ, ఇంటిగ్రేటెడ్ పరీక్షల్లో ఒకరి డిబార్

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 28: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల పీజీ 1వ సెమిస్టర్ ఎంఏ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎస్సీ, ఎంబీఏ, ఎంసీఏ, 5ఏళ్ల ఇంటిగ్రేటెడ్ ఏపీఈ, ఐపీసీహెచ్, ఐఎంబీఏ, 7వ సెమిస్టర్ పరీక్షలు బుధవారం 4వరోజు పరీక్షల్లో ఒకరు డిబార్ అయ్యారని, ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## న్యూసెన్స్ చేసిన యువకుడికి జైలు శిక్ష

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 28: రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని చంద్రశేఖర్ కాలనీకి చెందిన తెల్లవోళ్ల నరేంద్ర (22) అనే యువకుడు ప్రభుత్వపాఠశాలలో హల్‌చల్ చేశాడు. రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నరేంద్ర ఈనెల 27న మద్యం సేవించి నగరంలోని కుమార్‌గల్లిలోని ప్రభుత్వ పాఠశాలకు వచ్చాడు. పాఠశాలలోని పిల్లలను భయభ్రాంతులకు గురిచేశాడు. ప్రశ్నించిన పాఠశాల ఉపాధ్యాయులను కూడా పరుషపదజాలంతో దూషించాడు. దాంతో సదరు ఉపాధ్యాయులు రూరల్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దాంతో పోలీసులు వచ్చి యువకుడిని అదుపులోకి తీసుకుని విచారించి, కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో మహేష్ తెలిపారు.

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 28: నగరానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జి దీపదాస్ మున్షి, రాష్ట్ర సలహాదారుడు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపీ మధుయాష్కి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత ఆధ్వర్యంలో పలువురు మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. బంటు బలరాం, రాజేంద్రప్రసాద్, నరేందర్, నారాయణ, శివప్రసాద్, తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

## 'కాంగ్రెస్ జెండాను కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

రుద్రూరు, ఫిబ్రవరి 28: కాంగ్రెస్ పార్టీ జెండాను కూల్చివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూరి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్బర్‌నగర్ గ్రామంలో మంగళ వారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కాంగ్రెస్ పార్టీ జెండాను కూల్చివేశార న్నారు. అక్కడే ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీని సైతం చించేశారన్నారు. గత సోమవారం కోటగిరి ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణలో భాగంగా అక్బర్‌నగర్ గ్రామంలో తుమ్మల నాగేశ్వర్‌రావు, ఏనుగు రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయ కులు, కార్యకర్తల ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఇది చూసి ఓర్వలేక కొంత మంది వ్యక్తులు జెండాను కూల్చివేశారన్నారు. జెండాను కూల్చివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రుద్రూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## తైబజార్ వేలం పాట రద్దు

బోధన్ రూరల్, ఫిబ్రవరి 28: బోధన్ మున్సిపాలిటీ పరిధిలో గురువారం నిర్వహించనున్న తై బజార్, పశువధ శాల వేలం పాటను అనివార్య కారణాల వల్ల వాయిదా వేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి వచ్చే నెల 5వ తేదీన ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందన్నారు.

## మనవడిని హత్య చేసిన నానమ్మకు జీవిత ఖైదు

నిజామాబాద్ లీగల్, ఫిబ్రవరి 28: మనవడిని వరద కాలువలో పడేసి హత్య చేసిన నగుబోతుల గంగవ్వకు జీవితకారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ జిల్లా సెషన్స్ జడ్జి సునీత కుంచాల బుధవారం తీర్పును వెలువరిచారు. కమ్మర్‌పల్లిలోని పెద్దమ్మ కాలనీకి చెందిన గంగవ్వ కుమారుడు గంగాధర్‌కు మూడున్నర ఏళ్ల లక్కి ఉన్నాడు. గంగవ్వ చిత్తు కాగితాలు ఏరుకుంటూ జీవిస్తూ ఉండేది. ఆమె భర్త చాలా రోజుల క్రితమే చనిపోయాడు. ఆమెకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు గంగాధర్ తన భార్య గంగామణిని దాంపత్య విషయంలో తలపై ఇటుకతో కొట్టి చంపాడనే అభియోగంతో జైలుకు వెళ్లాడు. బెయిల్‌పై తిరిగి వచ్చాడు. ఆ సమయంలో గంగాధర్ కొడుకు మూడున్నర ఏళ్ల లక్కిని గంగవ్వనే చూసుకునేది. 70ఏళ్ల ముసలి తల్లిని పోషించడం, మనవడి బాగోగులు చూడటం బారం కావడంతో కొడుకులేని సమయంలో మే 10, 2023లో కమ్మర్‌పల్లి శివారులోని ఉప్లూర్ గ్రామానికి వెళ్లే రహదారి గల వరద కాలువలో మనవడిని ఎత్తిపడేసింది. వరదకాలువలో బాలుడు ఊపిరి ఆడక మరణించాడని మత్య అభియోగాలు కోర్టు నేర న్యాయ విచారణలో నిరూపన అయినట్లు జిల్లా సెషన్ జడ్జి సునీత తన తీర్పులో పేర్కొన్నారు. హత్యనేరం రుజువు అయినందున గంగవ్వకు జీవితకాల కారాగార శిక్ష విధిస్తూ 14 పేజీల తీర్పును వెలువడించారు. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఘురాజ్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు. పీపీకి సహాయులుగా కమ్మర్‌పల్లి పోలీస్ కానిస్టేబుల్ రామారావు వ్యవహరించారు.

## నవీపేటలో ఏటీఎం చోరీకి విఫలయత్నం

● అలారం మోగడంతో పోలీసుల అప్రమత్తం

నవీపేట, ఫిబ్రవరి 28: మండల కేంద్రంలోని రాంపూర్ రోడ్డులో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంను బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీష్, ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపిన ప్రకారం.. బుధవారం తెల్లవారుజామున 4గంటల నుంచి 4:30గంటల మధ్యలో గుర్తు తెలియని ఇద్దరు దొంగలు నెంబర్ ప్లేట్ లేని బైక్‌పై వచ్చి ఈ చోరీకి విఫలయత్నం చేశారని అన్నారు. ఏటీఎంను ధ్వంసం చేయడానికి యత్నిస్తుండగా బ్యాంకు కేంద్ర కార్యాలయంలో అలారం మోగడంతో వెంటనే వారు స్థానిక పోలీసులను అప్రమత్తం చేశారని పేర్కొన్నారు. సంఘటన స్థలానికి వెంటనే పోలీసులు చేరుకున్నప్పటికీ అప్పటికే దొంగలు పరారు అయ్యారని వారు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా బుధవారం సాయంత్రం క్లూస్ టీం సభ్యులు ఏటీఎంను పరిశీలించి ఆధారాలు సేకరించారు. ఈ విషయంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఏటీఎం చోరీకి యత్నిస్తున్న ఇద్దరి చిత్రాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి.

## చికెన్ ధరలు

| రకం | లైవ్ | విత్‌స్కిన్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| సుగుణ (కిలో) | రూ.140 | రూ.215 | రూ. 240 |
| వెన్‌కాబ్(కిలో) | రూ.145 | రూ.220 | రూ. 250 |

## బంగారం ధరలు

| బిస్కెట్ (10 గ్రా.) | ఆర్నమెంట్(10 గ్రా.) | వెండి(10 గ్రా.) |
|---|---|---|
| రూ.64,050 | రూ.59,050 | రూ.740 |

## సినిమా గైడ్ నిజామాబాద్

**పీవీఆర్ మల్టీప్లెక్స్..**

స్క్రీన్-1 : ఆర్టికల్-370 (హిందీ) (1.00, 7.10, 10.35)
: సుందరం మాస్టర్ (4.25)
స్క్రీన్-2 : సిద్దార్థరాయ్ (1.30)
: బ్రహ్మయుగం (4.40, 10.40)
: ఊరుపేరు భైరవకోన ( 7.40)
స్క్రీన్-3 : క్రాక్-జీతేగాతో జియేగా (హిందీ) (10.05, 6.35, 9.55)
: తప్పించుకుని తిరుగువాడు ధన్యుడు సుమతి (1.25)
: ఊరుపేరు భైరవకోన ( 3.35)
స్క్రీన్-4 : ముఖ్యగమనిక (1.05)
: మస్తీషేడ్స్ ఉన్నాయిరా (3.50)
: హనుమాన్ (6.50)
: సుందరం మాస్టర్ (10.10)

**ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..**

స్క్రీన్-1 : బ్రహ్మయుగం (1.50, 7.40)
: ఈగల్ (4.40)
స్క్రీన్-2 : ఆర్టికల్-370 (హిందీ) (10.40, 4.30)
: ఊరుపేరు భైరవకోన (1.45, 10.30)
: హనుమాన్ (7.30)
స్క్రీన్-3 : ఆర్టికల్-370 (హిందీ) (1.10, 7.20, 10.25)
: హనుమాన్ (4.20)

దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహల్ : బ్రహ్మయుగం (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : క్రాక్-జీతేగాతో జియేగా (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఊరుపేరు భైరవకోన (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్